# చాదస్తం

పాలపర్తి జ్యోతిష్మతి

సరుకుల పట్టీ రాశాను. వెళ్ళి తీసుకురండి' అంటూ సుబ్బారావు చేతిలో ఒక కాయితం పెట్టింది సుబ్బలక్ష్మి. పట్టీ చదవడం మొదలు పెట్టాడు సుబ్బారావు.

'ఇదేమిటి సుబ్బూ, ఇంతింత రాశావు? రెండు కిలోల శనగపిండి దేనికి?'

'రేపు చింటూ పుట్టినరోజు కదా! మైసూరు పాకూ, జంతికలూ చేద్దామనుకున్నాను. వాడి స్నేహితులు ఎవరైనా వస్తే పెట్టడానికి సరిపడా కాస్త ఎక్కువగా చేద్దామని'.

'నూనె నాలుగు కిలోలా?'

'చెప్పాను కదా, జంతికలు చేస్తానని. పది రోజుల్లో పండగుంది. పండక్కి గారెలూ, పూర్ణబ్బూరెలూ కావాలని ముందే ఇండెంటు పెడితిరి. నెల పొడుగునా కూరలకీ, తిరగమోతలకీ కావద్దూ? నాలుగు కిలోలైనా తెచ్చుకోకపోతే ఎట్లా సరిపోతుంది? కాస్తో కూస్తో మిగిలితే పారబొయ్యనులెండి. వచ్చేనెల కాస్త తక్కువ తెచ్చుకోవచ్చు.' విసుగ్గా అంది సుబ్బలక్ష్మి.

'సరే సరే! గోధుమపిండికూడా మూడు కిలోలు రాశావేంటి? ప్రతిదీ కిలోలు కిలోలు తెచ్చుకోవడమేనా?'

'ప్రతిరోజూ రాత్రి చపాతీలు చేసిపెడుతుంటే లొట్టలేసుకుంటూ తినట్లేదూ? సరుకులు తేకుండా వంటలెక్కడినుంచి వస్తాయి? ఆవాలు, మెంతులు, జీలకర్ర లాంటివి కిలోలు కిలోలేం రాయలేదు లెండి. సరిపడే రాశాను.' మూతి మూడు వంకర్లు తిప్పింది సుబ్బలక్ష్మి.

మీ అమ్మకి ఈ మధ్య చాదస్తం బాగా ఎక్కువైపోయిందిరా! 'చింటూవైపు తిరిగి అన్నాడు సుబ్బారావు.

బయటికి వెళ్ళివచ్చిన సుబ్బారావు 'కొట్లో కుర్రాళ్ళు ఇంకా రాలేదట. రాగానే సరుకులన్నీ కట్టించి ఇంటికి పంపిస్తానన్నాడు. నాకు ఆఫీసుకు టైమవుతుందని నేను వచ్చేశాను' అంటూ చేతిలోని సంచి సుబ్బలక్ష్మికి అందించాడు.

'మరి ఇవేంటి?' అంటూ సంచీలోకి తొంగిచూసి 'మళ్ళీ కూరలు తెచ్చారేంటండీ' అని అరిచింది సుబ్బలక్ష్మి.

'అబ్బ! ఎందుకట్లా అరుస్తావు? ఫ్రెష్‌గా కనిపించాయి. తెచ్చాను.'

'నిన్ననే కదా బోలెడు కూరలు తెచ్చారు. అవన్నీ ఎప్పటికి ఖర్చు కావాలి? ఎంత ఫ్రిజ్‌లో పెట్టినా ఎక్కువకాలం నిలవుండట్లేదు.'

'ఫ్రిజ్‌లో పెడితే ఎందుకు ఉండవు? జాగ్రత్తగా పెట్టుకోవడం నీకు చాతకాక ఎక్కువెక్కువ తెచ్చానని నన్ను తప్పుపడతావు' అసహనంగా అన్నాడు సుబ్బారావు.

'సహజంగా పండిన పంటలు కావివి. సూపర్ ఎరువులు వేసి పెంచినవి. ఎంత జాగ్రత్తగా పెట్టినా తొందరగా పాడైపోతా' యంది సుబ్బలక్ష్మి సుబ్బారావును శాంత పరుస్తూ.

'మీ అమ్మకి ఈ మధ్య చాదస్తం బాగా ఎక్కువైపోయిందిరా! చింటూ వైపు తిరిగి అన్నాడు సుబ్బారావు.

'సరుకులొచ్చాయా?' సాయంత్రం ఆఫీసు నుంచి వస్తూనే అడిగాడు సుబ్బారావు.

'ఆ!వచ్చాయి. పిండివంటలు చెయ్యడం కూడా అయిపోయింది.' అని సమాధానం చెప్తూ 'మళ్ళీ ఏం తెచ్చారు?' అని అడిగింది సుబ్బారావు చేతిలోని కవర్లను చూస్తూ.

రేపు చింటూ స్నేహితులు వస్తారు. వాళ్ళకి ఏమన్నా పెట్టాలి అన్నావు కదా! అందుకని స్వీట్లు తెచ్చాను.' అంటూ పేకెట్లు విప్పి బల్లమీద పెట్టాడు సుబ్బారావు.

మైసూరు పాకు తెచ్చారా? నేను ఇంట్లో చేస్తానన్నాను కదా?'

చేస్తే చేశావులేవోయ్. పిల్లలకి పెట్టడానికి ఉంటుందని తెచ్చాను.'

'వేరే ఏదైనా స్వీటు తేవచ్చు కదా, మళ్ళీ మైసూరు పాకే తెచ్చారేంటి అంటున్నాను.'

'ఆ షాపులో మైసూరుపాకు చాలా బాగుంటుంది సుబ్బూ! పిల్లలు ఇష్టంగా తింటారని తెచ్చాను.'

'ఆ మాట ముందే చెప్తే నేను ఇంకో రకం చేసేదాన్ని కదా?'

'మీ అమ్మకి ఈ మధ్య చాదస్తం బాగా ఎక్కువైపోయిందిరా!' చింటూవైపు తిరిగి అన్నాడు సుబ్బారావు.

'సరేలేండి, వాడికింకా కొత్త బట్టలు కొనలేదు. ప్రతిసారీ ఆఖరి క్షణం దాకా ఆ పని మిగిలిపోతూనే ఉంటుంది.'

'కుట్టించడమంటే లేటవుతుంది. రెడీమేడ్ బట్టలు కొనడమేగదా? అదెంతసేపు? ఇప్పుడే వెళ్ళి తీసుకువస్తాను.'

'ఆఫీసునుంచి వచ్చి వెంటనే వెళ్తానంటారేంటి? ఏమైనా తిని, కాఫీ తాగి, స్నానం చేసి వెళ్ళండి. వాణ్ణి కూడా తీసుకెళ్ళండి. వాడికి నచ్చినవి వాడే చూసుకుంటాడు.'

'చిన్నపిల్లాడు, వాడికి నచ్చడమూ, నచ్చకపోవడమూ ఏంటి? వాడికి ఏది బాగుంటుందో నాకు తెలీదా? నేను సెలక్టు చేసి తెచ్చినవి వద్దంటాడా వాడు? చిన్నప్పుడు మా అమ్మానాన్న ఏ బట్టలు కొంటే అవే మాట్లాడకుండా వేసుకునే వాణ్ణి నేను.'

'మన రోజులు వేరు. ఈ కాలం పిల్లల అభిరుచులు వేరు. వాడి స్నేహితుడు కొనుక్కున్నాడట ఏదో డ్రస్సు, అట్లాంటిది కావాలని చాలా రోజుల్నించి అడుగుతున్నాడు. వాణ్ణి తీసుకెళ్ళి నాలుగు షాపులు తిరిగి అటువంటిది ఎక్కడ దొరుకుతుందో చూసి కొనిపెట్టండి'

'మీ అమ్మకి ఈ మధ్య చాదస్తం బాగా ఎక్కువైపోయిందిరా!' చింటూ వైపు తిరిగి అన్నాడు సుబ్బారావు.

బజారునుంచి వస్తూనే కొత్తబట్టలు తీసి సుబ్బలక్ష్మికి చూపించాడు చింటూ.

'ఇదేనా నీకు నచ్చిన డ్రస్సు? చాలా బాగుందిరా' అంది సుబ్బలక్ష్మి అటూ ఇటూ తిప్పిచూస్తూ.

'రెండు జతలు కొన్నాడు నాన్న' అన్నాడు చింటూ ఇంకో జత బట్టలు చూపిస్తూ.

'పోనీలే! రేపు అది వేసుకుని ఇది పండక్కి ఉంచుకో' అంది సుబ్బలక్ష్మి.

అట్లా ఏం అక్కర్లేదు. రెండు జతలూ రేపే వేసుకుంటాడు. పొద్దున్న ఒకటి, సాయంత్రం ఒకటి' అన్నాడు సుబ్బారావు.

రెండోజత బట్టలు విప్పిచూసిన సుబ్బలక్ష్మి 'ఇదేంటండీ, ఇవి కొన్నారు? ఇట్లాంటివి ఇంతకు ముందు రెండుసార్లు కొన్నాం. వాడికివి అస్సలు నచ్చలేదు. ఒకటి రెండుసార్లు వేసుకుని పక్కన పెట్టేశాడు. కొత్తబట్టలు వృధాగా అట్లా పడున్నాయి.' అంది.

'నేను వద్దని చెప్తూనే ఉన్నాను. నాన్నే వినలేదు' తన తప్పేంలేదు అన్నట్లు సంజాయిషీ ఇచ్చుకున్నాడు చింటూ.

'వాడికి నచ్చింది ఒక జత కొనిపెట్టాను. నాకు నచ్చింది కూడా కొనాలనిపించింది, కొన్నాను' అన్నాడు సుబ్బారావు.

'వాడికి సౌకర్యంగా లేని బట్టలు కొనడం వల్ల ఉపయోగం ఏముంది, డబ్బు దండగ తప్ప?'

'ఆ డ్రస్సులో వాడు చాలా బాగుంటాడు సుబ్బూ!'

'నిజమే! కానీ అది వాడు ఇష్టపడి వేసుకునేటట్టు ఉండాలి కదా?'

'వాడు ఇష్టం లేదంటే అట్లా వదిలేయడమేనా? నచ్చచెప్పాల్సిన బాధ్యత నీకు లేదా?' విసుగ్గా అడిగాడు సుబ్బారావు. ఇంకేమీ మాట్లాడలేక సుబ్బలక్ష్మి అరచేత్తో నుదిటిమీద కొట్టుకుంది. సుబ్బారావు చింటూ వైపు చూశాడు.

'అమ్మకి ఈ మధ్యచాదస్తం బాగా ఎక్కువైపోయింది నాన్నా!' అన్నాడు చింటూ.

గర్వంగా ఒక చూపు సుబ్బలక్ష్మి వైపు వేసి లోపలికెళ్ళాడు సుబ్బారావు. సుబ్బలక్ష్మి సుబ్బారావును కోపంగా చూసి చింటూ వైపు తిరిగింది. వాడునెమ్మదిగా సుబ్బలక్ష్మి ఒళ్ళో చేరి 'అమ్మా! పొద్దున్నించీ నాన్న మాటిమాటికీ 'మీ అమ్మకి ఈ మధ్య చాదస్తం బాగా ఎక్కువైపోయిందిరా' అంటున్నాడు. అసలు చాదస్తం అంటే ఏంటి?' అని అడిగాడు.

సుబ్బలక్ష్మి ఫక్కున నవ్వింది. 'పొద్దున్నించీ 'మీ అమ్మకి చాదస్తం ఎక్కువైపోయింది. అంటూ మీనాన్న చేస్తున్న పనులనే చాదస్తం అంటారు' చింటూని ముద్దుపెట్టుకుంటూ చెప్పింది సుబ్బలక్ష్మి.

# అనాథ దుఃఖం

**- సంగెవేని రవీంద్ర**

స్పర్శే తెలియని సుతిమెత్తని పాదాలతో
తడిపొడి అడుగులు వేస్తూ
నీ గుండె గుడిలోకి చేరాలనుకున్నప్పుడు....
ఏదో ఓ అనాథ దుఃఖం...
ఉప్పెనలా కమ్ముకొంది...
కన్నీళ్ళతో తడుస్తున్న నిద్రదారిలో
సుదీర్ఘ కలలన్నీ తునాతునకలవుతున్నాయి
ఈ అజ్ఞాత ప్రయాణంలో ఏగమ్యం
స్వాగతిస్తుందో తెలియదు.
చీకటి శిలువపై చూపుల శిరస్సులు
ముక్కలుముక్కలుగా తెగిపడుతున్నప్పుడు
ఎవడో ఒంటికన్ను రాక్షసుడు
గుండె ముక్కల్ని బజార్లో విక్రయిస్తున్నాడు
మరో ఆకాశానికి చేరువవుతున్నవేళ
కాలుతున్న తుమ్మ ముళ్ళకిరీటి ఎవ్వడో
నాదిగులు దేహాన్ని
ఏకాకి లోయల్లోకి తోసేస్తున్నాడు
పొందాలనుకున్న ప్రతిసారీ
పోగొట్టుకోవడమే నావంతవుతుంటే
తుంటరి ప్రేక్షకుడెవరో యాసిడ్ నవ్వుల్ని
వర్షిస్తున్నాడు
గుప్పెడు ప్రేమకోసం...పిడికెడు నవ్వులకోసం
నువ్ స్వేచ్ఛగా నాలోకి అడుగులు వేసినప్పుడు
పసిడి రజనుగామారి నిన్ను పలకరిస్తాను
తళుక్కుమనే మంచు బిందువుల్లో నిన్ను చూస్తాను
విచ్చుకునే తొలికిరణంలో నిన్ను సందర్శిస్తాను
అస్తమించే ఎరుపు కాంతిలో నిన్ను ఆవిష్కరిస్తాను
కలల్ని ఛేదించే కలత నిద్రలో కూడా
వలపు పందిళ్ళుగా మారి పరిమళిస్తాను...!